క్లుప్తంగా...

కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దుండిగల్: ముందు వెళ్తున్న కంటైనర్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న యువకుడిగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాజేష్ కుటుంబం నగరానికి వలస వచ్చి నిజాంపేటలో నివసముంటుంది. ఇతని కుమారుడు చంద్రప్రకాశ్(24) మేడ్చల్‌లో సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే ఉదయం షాపు వెళ్లి తిరిగి ఈ నెల 23వ తేదిన అర్ధరాత్రి తన బైక్‌పై మేడ్చల్ నుంచి నిజాంపేట్‌లోని ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో 11:30 గంటల సమయంలో కెఎల్ యూనివర్సిటీ సమీపంలో ముందు వెళ్తున్న కంటైనర్‌ను బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చంద్రప్రకాశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

కుత్బుల్లాపూర్: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్ అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెమి దేవేందర్, మాజీ కౌన్సిలర్ శివకుమార్ గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి లేబర్ సెల్ అధ్యక్షులు కందడి సుదర్శన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
– మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ



నిజాంపేట్: వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సాయినగర్ ఆదిత్య గార్డెన్ కాలనీలో గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆదిత్య గార్డెన్ నూతన ప్రాంతాలు నీట మునిగిపోయాయి. దీంతో ఉదయం అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. వర్షం వల్ల వరదనీరు తర్కు చెరువులోకి వెళ్లేందుకు వీలుగా అన్ని చర్యలు చేపట్టారు. అదేవిధంగా రోడ్డుపై చేరుకుపోయిన బురదను జేసీబీలతో తొలగించి కాలనీ ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే అధికారులకు సమాచారం ఇవ్వాలని, ఎల్లప్పుడూ ప్రజలకు సహాయ చర్యలు చేపట్టడంలో వెనుకడుగు వేసేది లేదని కమిషనర్ అన్నారు. రెవెన్యూ అధికారులు, హైడ్రా అధికారులు సైతం ఆదిత్య గార్డెన్‌లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

బోనాల ఆహ్వానం అందజేత

నిజాంపేట్: బాచుపల్లిలో ఈ నెల 27వ తేదీన శ్రావణమాసం బోనాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్‌ను కలిసి బోనాల ఉత్సవాలకు ఆహ్వానించారు. శ్రావణ మాసం బోనాల సందర్భంగా ఇప్పటికే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని, ఉత్సవాలకు గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రహదారులు బురదమయం!

ప్రధాన రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

- అధికారుల సమన్వయ లోపం
- మాన్సూన్ సిబ్బందిని నియమించినా ఫలితం అంతంతే


పేట్‌బషీరాబాద్‌లోని రిలయన్స్ పెట్రోల్ బంక్ నుండి వివిధ కాలనీలకు వెళ్లే రోడ్డు

కుత్బుల్లాపూర్: వర్షాకాలం నేపథ్యంలో ప్రధాన రహదారులు నడవడానికి వీలు లేకుండా మారాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో 8 డివిజన్లలో ఒక్కో సూపర్ వైజర్ తో పాటు సిబ్బందిని నియమించినా ఫలితం లేకుండా పోయింది. ప్రధాన రోడ్లు నడవడానికి వీలు లేకుండా ఉన్నాయి. వాహనాలు ముందుకు పోవడం లేదు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దష్టిలో పెట్టుకొని హైడ్రా ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయడంతో ఇతర విభాగం అధికారులు అది తమ పరిధి కాదు.. అన్నట్టుగా వ్యవహరించడంతో ఈ సమస్య తీవ్రమౌతుంది. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంరెడ్డినగర్‌లో ప్రధాన రోడ్డు మొత్తం వర్షపు నీటితో నిండిపోయి నడవడానికి వీలు లేకుండా మారింది. అదేవిధంగా హెచ్‌ఎంటీ మెయిన్ రోడ్డు పక్కనే నీరు నిలిచిన పట్టించుకున్న నాథుడే లేరు. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలో శివాజీ విగ్రహం వద్ద మూడు రోజులుగా వర్షపు నీరు రోడ్డుపైకి చేరిన ఆ నీటిని కాలువ తవ్వి తొలగించాల్సిన అవసరం ఉన్న ఏ ఒక్క అధికారి ముందుకు రావడం లేదు. గాజులరామారం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్ లో రోడ్డు మొత్తం వర్షం నీటితో ఉంది. ప్రజలు, వాహనదారులు అటువైపు వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్ పెట్రోల్ బంక్ నుండి వివిధ కాలనీలకు వెళ్లే రోడ్డు మొత్తం గుంతలుగా మారడంతో వర్షపు నీరు నిలిచి అటు ఇటు రాకపోకలు సాగించే వాహనాలు ప్రయాణం సాగించే విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇంజనీరింగ్ అధికారులు వర్షం పడ్డ సమయంలో ఆగమేఘాలపై అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించేవారు. కానీ ఇటీవల కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిల్ పరిధిలో రెండు ప్రత్యేక మాన్సూన్ సిబ్బందిని నియమించి వర్షపు నీటిని నిల్వ ఉండకుండా కట్టడి చేసే దిశగా ప్రయత్నం చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదని చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా మాన్సూన్ సిబ్బందితో పాటు ఇతర విభాగం అధికారులు సమన్వయంతో వ్యవహరించి ముందుకు సాగితే ఈ పరిస్థితి నుండి గట్టెక్కే అవకాశం ఉంటుంది.


బాలయ్యనగర్‌లో బురదమయంగా మారిన రోడ్డు


సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌లో.


హెచ్‌ఎంటీ మెయిన్ రోడ్డులో నిలిచిన వరదనీరు


రంగారెడ్డినగర్ శివాజీ విగ్రహం వద్ద..

కేసీఆర్ కిట్ల అందజేత

దుండిగల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నేతలు పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టారు. గిఫ్ ఏ స్మైల్ కార్యక్రమంలో ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శంభీపూర్‌లోని పార్టీ కార్యాలయంలో తల్లి బిడ్డలకు కేసీఆర్ కిట్లను అందజేశారు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు..


కేసీఆర్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

శ్రీవాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదానం

కుత్బుల్లాపూర్: అమావాస్యను పురస్కరించుకుని గురువారం జీడిమెట్ల గాంధీ విగ్రహం సమీపంలోని దుర్గామాత ఆలయం వద్ద శ్రీవాసవీ సేవాదళ్ సుచిత్ర శాఖ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యుడు సింగారపు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. అన్నదానంలో 600 మందికి మహా ప్రసాద భోజనం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పడకంటి వెంకటేశం, తోట భిక్షపతి, పల్ల నాగరాజు, ఉప్పల నాగరాజు, మాసెట్టి శివకుమార్, చిటిమెల శ్రీనివాస్, ఉప్పల రమేష్, ఉప్పల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు

నాలా కల్వర్ట్ విస్తరించినా తప్పని తిప్పలు !


గిరినగర్ నాలా కల్వర్ట్ వద్ద రోడ్డుపై డంప్ చేసిన మట్టి వ్యర్థాలు

రంగారెడ్డినగర్: లక్షలాది రూపాయలు వెచ్చించి రాకపోకలు సజావుగా కొనసాగేందుకు నాలా కల్వర్ట్‌ను విస్తరించినా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్ నాలా కల్వర్ట్ చిన్నదిగా ఉండటంతో 2023లో రూ.50 లక్షలు వెచ్చించి రోడ్డుకు రెండు వైపులా విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేశారు. ఇటీవల జీడిమెట్ల ఐలా ఆధ్వర్యంలో ఐడీపీఎల్–జగద్గిరిగుట్ట రోడ్డులోని ఎర్రగోడల మీదుగా రంగారెడ్డినగర్ శివాజీ విగ్రహం వద్ద వాటర్ డ్రెయిన్ పనులు చేశారు. పనుల్లో భాగంగా వెలువడిన మట్టి, సిమెంట్ వ్యర్థాలను సదరు కాంట్రాక్టర్ నాలా కల్వర్ట్‌ను ఆనుకుని రోడ్డుపై డంప్ చేశాడు. ఆరు నెలలు కావస్తున్నా వ్యర్థాలను తొలగించకపోవడంతో నాలా సమీపంలో రోడ్డు కుచించుకుపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వ్యర్థాలు రోడ్డుపైకి పేరుకుపోవడంతో ఈ ప్రాంతంలో బురదమయంగా మారుతోంది. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వ్యర్థాలను తరలించేలా ఐలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా విద్యార్థులకు ఎమ్మెల్యే చేయూత



సుభాష్‌నగర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మ దినాన్ని పురస్కరించుకుని గురువారం బహదూర్‌పల్లిలోని కె.ఎం.పాండు మెమోరియల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే సౌజన్యంతో 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు సగ్గిడి పద్మారావు, సత్యనారాయణ, మురళీ, దామోదర్, నారాయణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ మైమూన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణమాస పూజలు

కుత్బుల్లాపూర్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జీడిమెట్ల డివిజన్ ఎస్‌సీఎల్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సాంబశివరాజు గురువారం ఓ ప్రకటనలో లెపపారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 23 వరకు విశేష పూజలుంటాయని, ప్రతి రోజు భక్తుల గోత్రనామాలతో నిత్యార్చన, ప్రతి శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం, ఉదయం 9:30 గంటలకు అమ్మవారికి సామూహిక సహస్రనామ కుంకుమార్చన, సాయంత్రం 7 గంటలకు శ్రీలక్ష్మి అష్టోత్తర నామార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే విధంగా ఈ నెల 28న ఆండాళ్ తిరు నక్షత్రం సందర్భంగా గోదాదేవికి ఉదయం 9 గంటలకు పంచామృత అభిషేకం, ఆగస్టు 9న శ్రావణ పౌర్ణమి, శ్రావణనక్షత్రం పర్వదిన సందర్భంగా స్వామివారికి ఉదయం 5:30 నిమిషాలకు పంచామృత అభిషేకం , సాయంత్రం స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం, ఆగస్టు 15న నాలుగవ శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు సాముహిక వరలక్ష్మీ వ్రతం ఉంటుందన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనదలిచే భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకుని ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారు.

చెత్తను తొలగించరా?



కుత్బుల్లాపూర్: ఒక వైపు వర్షాకాలం కావడంతో మురికివాడ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. ఇదే క్రమంలో కాలనీలో పేరుకుపోతున్న చెత్తాచెదారం వల్ల తీవ్ర దుర్గంధం ఏర్పడి ప్రజలు జబ్బుల బారిన పడుతున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ డివిజన్ అయోధ్య నగర్ ప్రధాన రోడ్డుపైనే చెత్త పేరుకుపోయినా తొలగించడం లేదు. ఇదే విషయంపై సంబంధిత విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను తీయమని సిబ్బందికి చెబితే డబ్బులు అడుగుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు.

డయల్–ఏ–సెప్టిక్–ట్యాంక్ ..!


ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను ప్రారంభిస్తున్న ఆస్కీ డైరెక్టర్ జనరల్ రమేష్ కుమార్

- ఓఆర్ఆర్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సేవలు
- వాహనాలను ప్రారంభించిన ఆస్కీ డైరెక్టర్ జనరల్

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారులోని ఓఆర్ఆర్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల నిర్వహణ, క్లీనింగ్ కోసం డయల్–ఏ–సెప్టిక్–ట్యాంక్ కార్యక్రమానికి గురువారం జలమండలి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఎస్టీపీలు, ఎఫ్ఎస్టీపీల వద్ద సెప్టిక్ వ్యర్థాలను రవాణా, డంపింగ్ కోసం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సహకారంతో 50 మంది సెప్టిక్ ట్యాంక్ వాహనాల ఆపరేటర్లను ఎంపిక చేసింది. వీరికి సెప్టిక్‌ట్యాంక్ వ్యర్థాల నిర్వహణపై శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇవ్వడమే కాకుండా విధి నిర్వహణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతాసామగ్రితో పాటు కార్మికులకు ప్రత్యేక యూనిఫామ్‌ను కూడా అందజేసింది. సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను ఆస్కీ డైరెక్టర్ జనరల్ రమేష్‌కుమార్, హెడ్ఇన్ ఇన్‌చార్జి జనార్దన్ రెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆస్కీ భవన ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు.

◆ 7 కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలతో పాటు 18 గ్రామాల్లోని సెప్టిక్‌ట్యాంక్ మానవ వ్యర్థాలను శుద్ధిచేసి, పర్యావరణానికి ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ కార్యక్రమాన్ని రూపొందించింది.

ఇప్పటికే...

ప్రస్తుతం జలమండలి అంబర్‌పేట్, నల్లచెరువు, నానక్‌రామ్‌గూడ, ఖాజాగూడ ఎస్టీపీల వద్ద 40 కేఎల్‌డీ సామర్థ్యం గల కో–ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించి ఇప్పటి వరకు మొత్తం 84 మిలియన్ లీటర్ల సెప్టేజ్ కో–ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేశారు. ఇంతకు ముందు ఉత్పన్నమయ్యే సెప్టిక్‌ట్యాంక్ వ్యర్థాలను చెరువులు, కాల్వలు, కుంటల్లో పారబోసి ఇటు పర్యావరణం, ప్రజల ఆరోగ్యానికి చేటుచేసే పరిస్థితి ఉండేది. దీనిని నివారించేందుకు సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను శుభ్రపరిచే వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ వాహనాలు సెప్టిక్ ట్యాంకర్ వ్యర్థాలను ప్రతిపాదిత ఎస్టీపీలల్లో డంపింగ్ చేసి, శుద్ధిచేయడం వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తవని జలమండలి అధికారులు చెబుతున్నారు. జలమండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు పద్మజ, సుజాత తదితరులు పాల్గొన్నారు. ట్యాంక్ క్లీనింగ్‌కు 155313,14420.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన మీ సేవ నిర్వాహకులు


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మీ సేవ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ మీ సేవ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి దయసాగర్ ఆధ్వర్యంలో మీ సేవ నిర్వాహకులు గురువారం మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సీఎస్‌సీ, ఎస్‌పీసీ సంస్థలతో కుదుర్చుకున్న మీసేవ సర్వీసుల అవగాహన ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని, దీని వల్ల మీసేవ నిర్వాహకులు నష్టపోతున్నారన్నారు. మీసేవ లాగిన్‌లో ఆర్.ఓ.ఆర్, 1బీ, పహాణీని తిరిగి చేర్చాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆధార్ సెంటర్ల నిర్వాహకులకు యూఐడీఏఐ వేసిన ఫైన్లను రద్దు చేయాలని కోరారు. ఆధార్ సెంటర్లకు రూ.1.50లక్షల డిపాజిట్ల నిబంధనను తొలగించాలన్నారు. అదే విధంగా మీ సేవ నిర్వాహకుల కమీషన్లను పెంచాలని, వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ సరిఫికెట్లు వెంటనే జారీ అయ్యేలా చూడాలన్నారు. ఉచిత కరెంట్, ఇంటర్‌నెట్ వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ మోహిన్, ట్రెజరర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలకు ఆలయం ముస్తాబు



సుభాష్‌నగర్: శ్రావణ మాసం సందర్భంగా సూరారంలో ప్రసిద్ధిగాంచిన ఉమామహేశ్వర ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ మాట్లాడుతూ.. శ్రావణ మాస సందర్భంగా ప్రతి సోమవారం స్వామివారు విశేషమైన అలంకరణతో దర్శనమిస్తారని పేర్కొన్నారు. 27న నాగుల పంచమి సందర్భంగా ఆలయ ఆవరణలో స్వయంగా వెలిసిన నాగేంద్రుని పుట్ట వద్ద ప్రత్యేక పూజలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నెలరోజుల పాటు జరిగే శ్రావణ మాస పూజల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కంటి వైద్య శిబిరం

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్‌లోని అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కొంపల్లిలోని సాలిస్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 74 మంది సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా చౌరస్తాల్లో విధులు నిర్వహించే క్రమంలో పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ కె.వెంకట్‌రెడ్డి, సీఐ ఏ.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బూట్లు పంపిణీ


బూట్లు అందుకున్న విద్యార్థులతో సతీష్‌సాగర్ తదితరులు

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందిస్తే భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ అన్నారు. సంకల్ప్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దూలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బూట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా కొంపల్లి, దూలపల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కనీస అవసరాలను తీరుస్తున్న సంకల్ప్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సేవలను కొనియాడారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్ మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరం జనవరి 26న పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో విజేతలకు మా ఆర్గనైజేషన్ ద్వారా బహుమతుల ప్రదానం చేశామని, ఆ సందర్భంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ సూచన మేరకు విద్యార్థులకు బూట్లు, సాక్స్‌లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేశ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాజి రెడ్డి, సంకల్ప్ ఫౌండేషన్ సభ్యులు శివాజీ రాజు, శ్రీకాంత్ గౌడ్, ఉప్పరి మహేందర్ సాగర్, ఉపాధ్యాయులు జయమాల, కవిత, నాయకులు నర్సింహ, దుర్గా అశోక్, మధు, నర్సింగ్ రావు, మహేష్, భజరంగ్ దళ్ సభ్యులు అరుణ్, రవీందర్, శశికాంత్, రాజేందర్ పాల్గొన్నారు.

